

# చెల్లిన నోటు

బదిలీ అయిన మరునాటికల్లా రామాపురం చేరుకున్నారు దంపతులిద్దరూ- అంటే ఎవరో కాదు. నేనూ మా ఆవిడ. కొత్త వూరులో కొత్త సంసారం ఎంత లక్షణంగా వుంటుందో లక్షణ గ్రంథాల్లో అదివరకే లిఖింపబడి వుండటం వలన ఈనాడు కొత్తగా మళ్ళీ పాత పచ్చడికి తిరగమూత పెట్టక్కర్లేదు. పొరుగింటి పుల్లమ్మని ఎదురింటి ఎల్లమ్మని అడిగి బియ్యం, బొగ్గులు వగైరా అన్నీ సమకూర్చింది గృహలక్ష్మి. వంట అయి భోజనానికి కూర్చోబోతుండగా తినటానికి విస్తళ్లు లేవని గ్రహించటం జరిగింది.ఆ విషయాన్ని మొదట ఎవరు గ్రహించారా అన్న విషయంమీద కాసేపు యధాశక్తి తర్జన భర్జన కావించి అది అసందర్భమైన విషయమని యిద్దరమూ ఏకగ్రీవంగా గుర్తించటం వలన ఆ సమస్యను అంతటితో ఆపేశాం.

మేము అద్దెకు కుదుర్చుకున్న ఇంటికి ఎదురుగా వున్న మండువాకొంపలో ఒక పెద్దమనిషి విస్తళ్లు కుట్టటం చూసినట్లు జ్ఞాపకం. నా జ్ఞాపకశక్తికి ఒక చిన్న సైజుది కాంప్లిమెంటు తగిలించుకుని ఆ యింటికి పోయాను. సొంతం కోసం కుట్టుకున్న విస్తళ్ళు పందారం చెయ్యటానికి ఆయన ఇష్టపడక పోవటం వలన అక్కడినుంచి సెట్టి దుకాణం వైపుకి ముఖం తిప్పాను. పోతూ పోతూ జేబులో డబ్బుకోసం వెతుక్కుంటే కనపడలేదు. ఇంటికిపోయి అర్ధాంగిని అడిగి తెలుసుకుందామని చేసిన ప్రయత్నం విఫలం కావటంతోనే నా పెట్టెలోవున్న పైకం విషయం మీదికి దృష్టి పోయింది. అసలు రామాపురం బయలు దేరుతున్నప్పుడు పెట్టిలో డబ్బు పెట్టానని

మా మామయ్య చెప్పాడు. సరే దానిలో కొంత స్వీకరించి ఆపత్సమయంలో ఆదుకోవటం మంచిదని పెట్టెతీశాను. పెట్టె అంతా శోధించి గాలించినా దమ్మిడీ గూడా దొరకలేదు- అపచారం. దమ్మిడీ అంటే దమ్మిడీ కాదు నా వుద్దేశం. పనికిరాని దమ్మిడీలు కాసిని వున్నాయి- అట్ట అడుగున. అవన్నీ ధనలక్ష్మి పేరిట మా నాయనమ్మ దాచుకున్న బాపతు. ఆ పెట్టే యిప్పుడు వాడుతున్నది- చిట్టచివరికి పెట్టెలో మూలగావున్న డబ్బామీదికి నా ఆలోచన పోయింది. డబ్బా తీసిచూస్తే చిన్న గుడ్డమూట వుంది. దాన్ని విప్పి తీసిచూస్తే పర్సు వుంది. ఆ పర్సులో వుంది వంద రూపాయల నోటు-

ఆ నోటు బయటకు లాగి..... రెండు చేతులతో పట్టుకుని పద్మాసనంవేసి ఆలోచనకు దిగాను. దానిని మార్చేదెలాగు? అది తప్పితే చేతిలో పైసా లేదు. డబ్బు లేనివాడు డుబ్బుకు కొరగాడని సామెతె వుంది గదా! అసలే పల్లెటూరాయెను. చూస్తూ చూస్తూ ఎరగనివాళ్ళదగ్గర ఆసెట్టి మాత్రం ఏ ధైర్యం చూచుకుని వంద రూపాయల నోటు పుచ్చుకుంటాడు. చెల్లుతుందో చెల్లదో? అయినా చిల్లర వుండద్దూ! ఏం జరుగుతుందోనని మనస్సును గట్టిపరచుకుని హృదయాన్ని పదిలపరచుకుని బజారుకు బయలుదేరాను. హృదయేశ్వరి, ప్రాణసఖి...... యింకా ఏవేవోనూ అయిన మా గృహలక్ష్మి దారికడ్డంగా నిలబడి సంచీ, నూనెసీసా అందించి చిరునవ్వు మొహాన పారేసింది- దాన్ని పెట్టి సామాన్లన్నీ కొనుక్కురమ్మన్నట్లు.

సంచీ భుజాన వేసుకుని. సీసా సంచీలో పడేసి బజారోన్ముఖుడనై వెళ్ళిపోయాను బజారులో సెట్టి నావంక కొంచెంగా చూచి "అతి వినయం" చూపించాడు. వాడి వినయంలో నాకు కావలసినంత స్వీకరించి వచ్చినపని చెవిన పడేశాను. అట్లాగే అంటూ పది విస్తళ్ల కట్టకట్టి సంచీలో పెట్టాడు. నూనె ప్రస్తుతం అవసరం లేదని విన్నవించుకోవటం వలన నామీద అతి ప్రేమకొద్దీ దాన్ని నింపి పారేయకుండా దాన్ని వున్నది వున్నట్లు వుంచాడు. సీసా అక్కడే వుంచమని చెప్పి జేబులోనుంచి వందరూపాయల నోటుతీసి ఆయన ముందుంచాను. ముందుకొంచెం వుక్కిరి బిక్కిరి అయిన తర్వాత సర్దుకుని బిక్కమొహం వేశాడు. "చిల్లరలేదుట" అదీ యిప్పుడు సమస్య. పైకం పట్టుకోకుండా వస్తువు వదులుకోవటం యిష్టంలేదు. చూస్తూచూస్తూ ఎరగని మనిషికి అప్పుపెట్టి బాగుపడేది కనపడలేదు.

నాలోవున్న కోపాన్నంతా ఒక్కసారి నోట్లోకి తెచ్చుకుని గబగబా కక్కేశాను నాలుగు ఘాటైన మాటలతో కలిపి. నా వుద్దేశమేమీలేదు. అప్పు యివ్వటానికి యిష్టపడని చవట షాపు ఎందుకు పెట్టాడా అని. నా అభిప్రాయంతో ఆయనగూడా ఏకీభవించటం వలన ఖాతా పుస్తకం తెరవటం జరిగింది. దానితో ప్రారంభమయింది కథంతా. విస్తరాకులు తీసుకుని యింటి మీదికి వచ్చి పడ్డాను.

పొద్దుకూకి తెల్లవారగానే మళ్ళీ ఆకలి వెయ్యటం, అన్నం వండాలంటే బియ్యం కావలసి రావటం, బియ్యం కింద కట్టెలు కావలసి రావటం వగైరాలు అన్నీ జరిగాయి. తిరిగి సెట్టిదగ్గరకు పోయి కావలసినవన్నీ తీసుకుని పద్దుపుస్తకంలో రాసేసి బయటపడ్డాను. బయటకు రాగానే బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. మొన్ననే పట్నంలో అదేదో ఇంగ్లీషు సినిమా చూచాను. అదే "మిలియన్ పౌండు నోటు"... అది బుర్రలో మెదిలింది. ఆనోటుచూసి అప్పు పెడతారు. ఆ కథలో... అట్లాగే నేనూగూడా అందరిదగ్గరా ఈ నోటు చూపించి అప్పు పెట్టేస్తే....

యింకేముంది...... గ్రాండ్...

అక్కడినుంచి సూటిగా కాఫీహోటలుకు పోయి అన్నం అవసరం లేకుండానే కడుపు నింపేశాను, నానా చిరుతిళ్లతోనూ. దొరలాగా జేబులోనుంచి నోటుతీసి రెండు వేళ్ళతో చివరగా పట్టుకున్నాను. షావుకారు మొదట కంగారుపడి తరువాత నిజంగా పడిపోవటంతో మొహంమీద కొంచెం కాఫీ చల్లి లేవతీసి కూర్చోపెట్టి వుప్మా తినిపించాం. ప్రాణం సర్దుకున్న తర్వాత.... వందరూపాయల నోటు చూడటం యిదే మొదటిసారని తన దగ్గర పది రూపాయలమించి చిల్లర లేకపోవటం వలననే యింత ప్రమాదం జరిగిందనీ చెప్పాడు. అటువంటి సందర్భంగా కలిగిన కథలన్నీ వకళ్ళ తర్వాత ఒకళ్ళు వారివారి చాకచాక్యాల ననుసరించి చెప్పటం అయిన తర్వాత వర్తమానంలో ప్రవేశించి "ఇప్పుడు చెయ్యాల్సిందేమిటో" అని ఆలోచనలోకి దిగబడిపోయాం. అప్పు పుస్తకం ప్రారంభించటం నాకు తోచిన ఆలోచన, షాపు వాడికి తప్పని అగత్యం. ఈ గతంలో గూడా జయంపొంది అక్కడినుంచి పక్కగుడ్డల కొట్టులోకి పోయాను. ఒకటి రెండు తుండు గుడ్డలు.... మూడు నాలుగు జేబురుమాళ్ళు తీసుకుని మొదటిదానితో ముఖం రెండవదానితో ముక్కు తుడుచుకుని.... మళ్ళీ వాపసు తీసుకోటానికి వీల్లేకుండా- తరవాత వంద రూపాయల నోటు బయట పెట్టాను. గుడ్లు మిటకరించి పళ్ళు పటపటలాడించి గొణగటం ప్రారంభించాడు. అటువంటి వాని వలన వుపయోగం వుండదని సోదాహరణంగా నచ్చచెప్పి ఖాతా పుస్తకం తెరవమని సలహా చెప్పాను. తరవాత ఏమయిందీ చెప్పేదేముంది.

చెల్లని వందరూపాయలనోటు, వూహించిన ఘనకార్యాలను అనుకున్నట్లుగా సాధిస్తోంది. పట్టటానికి పగ్గాలు లేకపోతున్నాయి రోజులు గడిచినకొద్దీ. మరునాడు ఇరవైశేర్లు బియ్యం, వీశెడు పంచదార, పదకొండు కొబ్బరికాయలు తీసుకొని ఎడంచేత్తో నోటు చూపిస్తూ కుడిచేత్తో పుస్తకంలో బరికేశాను. బిక్కమొహం పెట్టి సాగనంపాడు నన్ను బయటికిదాకా. కాఫీ హోటలుకు ఆ రోజు సాయంత్రం నా సహాధ్యాయుడిని గూడా వెంట తీసుకుని పోయి బిల్లు పుస్తకంలో రాసేసి వచ్చేశాను. నాతో చెప్పకుండా మా అర్ధాంగి ఒక చీరె కొనుక్కుని వచ్చింది, ఫలానా... వందరూపాయలనోటుగారి తాలూకు మనిషినని చెవుతూ దానితో ఇంటిల్లిపాదీగా చెలరేగిపోయినట్లయింది. ఎప్పుడు ఎవరికి ఏది కావాలంటే ఈ మూడు దుకాణాల్లోనూ తిరుగులేదు. కావలసినది తీసుకోవటం, పద్దు రాసేసి బయటపడటం.

ఇది జరిగిన తర్వాత, సూర్యుడు నాలుగోసారి గామాలు అస్తమిస్తుండగా సెట్టి దుకాణం దగ్గరకు పోయాను, పంచదార పట్టుకొద్దామని. షాపు దగ్గరకు పోయేసరికి సెట్టి మరెవరో యిద్దరితో మాట్లాడటం కనిపించింది. ఎవరా అని చూస్తే గుడ్డల కొట్టువాడూ, కాఫీ దుకాణంవాడూ. నన్ను చూడగానే ముగ్గురూ లేచి నిలబడి చేతులు జోడించి నమస్కారం పెట్టారు. నా గుండెల్లో యిటికిరాయి పడ్డట్టు అయింది. ముగ్గురికీ మూడుసార్లు దణ్ణంపెట్టి సెట్టితో వచ్చిన పని విన్నవించాను. అడగటంతోనే పంచదార పొట్లం కట్టి యిచ్చేశాడు. యధాలాపంగా పద్దుపుస్తకం మీదికి నాదృష్టి ప్రసరించింది. సెట్టి "పైసలెప్పుడిస్తారు మాష్టరుగారూ" అన్నాడు వినయం నా మీద వలకబోస్తూ. మీదపడ్డ వినయాన్ని గుడ్డపెట్టి తుడుచుకుని "ఏం షావుకారూ... యివ్వాళ కొత్తగా అడుగుతావ్.... వంద రూపాయలనోటు చిల్లర మారలేదుగదా" అన్నాను.

ఒక క్షణం నా వంకచూచి "చిల్లర పట్టుకొచ్చానండి" అన్నాడు. తిన్నదంతా వక్కసారి నీళ్ళు కారిపోయింది. నిలువునా ఒకసారి విరుచుకు పడిపోదామనుకున్నాను గాని పక్కన ఆధారం ఏమీలేకపోవటం వలన ఆ ప్రయత్నం విరమించుకుని "చిల్లర వుంటే అంతకంటే కావలసింది ఏముందయ్యా... అట్లాగే" అంటూ జేబులోనుంచి నోటుతీసి ఇచ్చాను. తను చేయవలసిన పరీక్షంతా నోటుమీదచేసి మిగతా యిద్దరికీ చూపించి నోటుదొంగ బాపతుదిగాదు అని ఖాయం చేసుకున్న తర్వాత "పంతులుగారూ మీ దగ్గర రెండణాలు వున్నాయా" అన్నాడు. "ఎందుకు?" అన్నా వెంటనే. చెప్పుతాను కదండీ" అంటూనే నేనిచ్చిన రెండణాలు తీసుకుని వక్కసారిగా నిట్టూర్చాడు బలంగా. దానికి కొట్టుకుపోవలసిందేగాని దైవవశాత్తు నిలబడగలిగాను. నేనలాగే నిలబడి వుండటం చూచి "యింకా.... ఏం కావాలండీ" అన్నాడు సెట్టి. "ఇంకా ఏమీ అక్కర్లేదు" అన్నా సెట్టి సరుకుల సంగతి అడుగుతున్నాడనుకుని. ఆ మాట అన్న తర్వాత గూడా నిలబడి వుండటం చూచి "మరి ఇంకా నిలబడి వున్నారేం" అన్నాడు. "చిల్లర" అన్నాను. "సరిపోయింది" అన్నాడు సెట్టి. తన సమాధానానికి బరువు యిస్తున్నట్లు మిగతా యిద్దరినీ గూడా చూపించి "మా ముగ్గురికీ సరిపోయిందండి పంతులుగారూ...." అన్నాడు "హా. లక్ష్మణా" అనుకున్నాను. లక్ష్మణుడుగాని ఆయన బాపతువాళ్లుగాని ఎవరూ కనపడలేదు. ఇంక జన్మలో ఖాతా పెట్టకూడదనిపించింది. తెల్లవారితే కాఫీలోకి పంచదార కావాలి గదా మరి! "యివ్వాల్టికి ఒక్కరోజుకి పోన్లే" అనుకుని పద్దు పుస్తకంలో రాసి బయటపడ్డాను ఆ రోజుకి గూడా.

(ప్రజామత, 5 జూన్, 1955)